క్లుప్తంగా

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టండి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ బాబ్జి

పాకాల : పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు 10వ తరగతి విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహించాలని ఎంఈఓ బాబ్జి తెలిపారు. శుక్రవారం మొగరాల జెడ్పీ హైస్కూల్‌ను ఆయన సదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థులకు స్లిప్‌టెస్ట్‌లు పెట్టి వారి సామర్థ్యాలను గుర్తించాలన్నారు. వారికి అవసరమైన మేర మెటీరియల్ అందించి చదివించాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం పథకంలో ప్రతి రోజు ఎంతమంది భోజనం చేస్తున్నారు అనే విషయాన్ని వారి హాజరుకు సంబంధించిన యాప్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుమలత, ఉపాధ్యాయులు, సీఆర్పీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

స్త్రీనిధి చెక్కు పంపిణీ



ఎమ్మెల్యే నానికి వినతిపత్రం అందిస్తున్న పెరుమాళ్లపల్లి గ్రామస్తులు

తిరుపతి రూరల్: కోరిన కోర్కెలను తీర్చే పెరుమాళ్లపల్లిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని టీటీడీ పరిధిలోకి చేర్చాలని పెరుమాళ్లపల్లి గ్రామస్తులు స్థానిక స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నానిని కోరారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం పెరుమాళ్లపల్లిలో సర్పంచ్ జోగి మోహన్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాని పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మహిళల జీవనోపాధులను పెంపొందించాలనే లక్ష్యంతో స్త్రీనిధి పథకం కింద గ్రామంలోని 10 మహిళా సంఘాలకు రూ.50 లక్షల చెక్కును లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులునాయక్, ఎంపీడీఓ రమేష్ బాబు, ఈశ్వర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, ఏపీఎం పరశురాంరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభల్లో కూటమి నేతలకు అవమానం

భాకరాపేట : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలను అధికారులు తూతూ మంత్రంగా నడిపించి మమా అనిపించారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం మండలంలో శుక్రవారం ఉపాధి హామీ పథకం గ్రామసభలు జరిగాయి. చిన్నగొట్టిగల్లు మండల కేంద్రంలో గ్రామ సభకు ఎమ్మెల్యే, జిల్లా కలెక్టరు, పీడీ, జిల్లాస్థాయి అధికారులు వస్తున్నారని టీడీపీ నాయకులు, కార్యకర్తలు వచ్చారు. వారితోనే గ్రామసభ నిర్వహించారు. అయితే చిన్నగొట్టిగల్లు జరిగిన సభా వేదిక ఒక పార్టీ నాయకులతో నిండిపోవడంతో కూటమి నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. ఈ సభలో ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. సర్పంచులు, ప్రత్యేక అధికారులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల కొరతతో ఇక్కట్లు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు అనుగుణంగా ప్రభుత్వం చొరవ తీసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ, ఎస్ఎంఎస్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భరత్‌రవి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నగరంలో ప్రభుత్వ విద్యాసంస్థలు లేకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణం ప్రభుత్వం చొరవ తీసుకుని తగినన్ని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరారు. యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీపై ముగిసిన శిక్షణ

తిరుపతి సిటీ: ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఔరంగబాద్, తిరుపతి నైల్ ఐటీ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. కళాశాల ఆవరణలో గత ఐదురోజులుగా బూట్ క్యాంప్ పేరుతో విద్యార్థులకు యూఏఎస్ (అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్) డ్రోన్‌పై హ్యాండ్స్ ఆన్ ఎక్స్‌పీరియన్స్ అండ్ ట్రైనింగ్ ఇచ్చారు. ప్రతి విద్యార్థి నూతన టెక్నాలజీ డ్రోన్ వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ధృవపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల అధ్యాపకులు, నైల్‌ఐటీ సంస్థ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కఠిన చట్టాలు తీసుకురావాలి



మహిళా వైద్యులకు తక్షణం భద్రత అవసరం. తీవ్రతను తగ్గించాలనో.. లేదా తాత్కాలిక ఉపశమనం కల్పించామనే మాటలు, ఉత్తర్వులు మాకు వద్దు. మహిళా వైద్యుల భద్రత విషయంలో స్పష్టమైన చట్టాలు అవసరం. వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో కఠినమైన చట్టాలు చేస్తారని ఆశిస్తున్నాం. ఆ తర్వాతే జూనియర్ డాక్టర్లు దేశవ్యాప్తంగా సరైన నిర్ణయం తీసుకుంటారు. రాష్ట్రప్రభుత్వం, సుప్రీంకోర్టు సూచనలతో తాత్కాలికంగా ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నాం. కోల్‌కతాలో వైద్యురాలికి జరిగిన అన్యాయం ఇక పునరావృతం కాకూడదు. మాకు మద్దతు ఇచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

– డాక్టర్ షేక్ అమీరున్, ప్రెసిడెంట్, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్

భద్రత పెంచాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో తక్షణం భద్రత పెంచాలి. రుయా నుంచి స్విమ్స్‌కు వెళ్లే మార్గం, మెడికల్ కాలేజీ ప్లేగ్రౌండ్ చుట్టూ ప్రతిరోజూ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. రాత్రివేళ అటు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. పోలీస్ అధికారులు చొరవ తీసుకొని పెట్రోలింగ్ నిర్వహించాలి. మహిళా వైద్యుల హాస్టల్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి గస్తీ పెంచాలి. రాత్రివేళ ఇతర వాహనాలను తనిఖీ చేసిన తర్వాతే రుయాలోకి అనుమతించాలి. చట్టాలు వచ్చేలోపు తాత్కాలిక భద్రత కల్పించాలి.

– డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, జనరల్ సెక్రటరీ, జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్

రాత్రివేళ ఇద్దరు డ్యూటీలో ఉండాలి



స్థానిక పీహెచ్‌సీల్లో రాత్రి విధులు నిర్వహించే సమయంలో ఒకరికే డ్యూటీ వేయకుండా, మరొకరికి కూడా డ్యూటీ వేయాలి. అలా వేయడం వల్ల మహిళా ఉద్యోగులు భయపడాల్సిన అవసరం ఉండదు. రాత్రి సమయంలో కొంతమంది మద్యం సేవించి ఆస్పత్రికి వస్తారు. అలాంటి వారితో వాదించాలంటే ఒకరికి ఒకరు తోడు ఉండాలి. ఒకరికే డ్యూటీ వేస్తే భయంభయంగా విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆస్పత్రి ఆవరణలో గేటు ముందు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలి. అప్పుడే ఆస్పత్రిలోకి ఎవరు వస్తున్నారన్నది తెలుసుకోవడానికి వీలవుతుంది.

– భగవతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్, పాకాల

కన్నీటి అవస్థలు

అది ప్రభుత్వ కార్యాలయం. ప్రజా సమస్యల పరిష్కారానికి అక్కడ సిబ్బంది నిరంతరం పనిచేస్తూ ఉంటారు. ఉదయం వస్తే ఒక్కోసారి రాత్రి వరకు కూడా పని చేయాల్సిన పరిస్థితి. కార్యాలయంలో నీటి వసతి లేక అర్జీదారులతో పాటు ఉద్యోగులు అల్లాడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగుల మరుగు కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం వల్ల తమ బాధలు ఎవరికి చెప్పుకోలేక మానసిక ఆందోళనకు గురవుతున్నారు.

- తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేయని బోరు
- కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఇక్కట్లు
- నీటి వసతి లేక అర్జీదారులు, ఉద్యోగుల అవస్థలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు





తిరుపతి రూరల్ తహసీల్దార్ కార్యాలయం వద్ద జనం, పాడైపోయిన బోరు

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో నీటి అసరాలను తీర్చేందుకు గతంలో బోరు వేశారు. సంపును కూడా తవ్వించారు. మోటారు రెండు నెలల కిందట కాలిపోయింది. రిపేరు చేద్దాం అని ప్రయత్నిస్తే మోటరు బోరు పాయింట్‌లోకి పడిపోయింది. నాటి నుంచి ఎవరూ బోరు గురించి పట్టించుకోవడం లేదు. బోరు ఉన్నప్పుడు తహసీల్దార్ చాంబర్‌లో ఉన్న మరుగుదొడ్డిని మహిళా ఉద్యోగులు ఉపయోగించుకునేవారు. ఇప్పుడు పరిస్థితి దారుణంగా తయారైంది.

12 మంది మహిళా ఉద్యోగులు..

తిరుపతి రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో వివిధ క్యాడర్లలో మొత్తం 12 మంది మహిళా సిబ్బంది పనిచేస్తున్నారు. వీరితో పాటు మరో 21 మంది రెవెన్యూ సిబ్బంది తహసీల్దార్ కార్యాలయానికి వస్తుంటారు. రోజు పదుల సంఖ్యలోనే అర్జీదారులు సమస్యలను విన్నవించుకునేందుకు వస్తారు. అయితే ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వారు కార్యాలయంలో పనిచేయాల్సి రావడం.. కనీసం 'మరుగు' సౌకర్యం లేకపోవడం వల్ల ఇబ్బందికర పరిస్థితుల్లో ఇంటికి వెళ్లి కాలకృత్యాలను తీర్చుకోవాల్సిన దుస్థితి అని పలువురు మహిళా ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం జిల్లా కలెక్టర్ స్పందించి బోరుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

త్వరలోనే పరిష్కరిస్తాం..



కార్యాలయంలోని బోరు పాడైనట్లు తెలిసింది. నీటి సమస్య కూడా ఉంది. త్వరలోనే పరిష్కరిస్తాం. ఇప్పటికే కార్యాలయం చుట్టూ ముళ్ల కంపలను తొలగించాం. శుభ్రతకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

– రామాంజనేయులునాయక్, తహసీల్దార్, తిరుపతి రూరల్

25న కనకాభిషేకం

తిరుపతి కల్చరల్: శ్రీవాసవి ఆర్యవైశ్య సమాజం ఆధ్వర్యంలో 14వ ఉచిత కనకాభిషేక మహోత్సవం ఈనెల 25వ తేదీ ఆదివారం తిరుచానూరు రోడ్డు లోని శ్రీపద్మావతి కల్యాణ మండపంలో అత్యంత వేడుకగా చేపడుతున్నట్లు శ్రీవాసవి ఆర్యవైశ్య సమాజం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్య సమా జం ఆధ్వర్యంలో తిరుపతి నగరంలో 14వ ఏట చేపట్టే ఈ సామూహిక కనకాభిషేక మహోత్సవానికి సుమారు 8 రాష్ట్రాల నుంచి ఆర్యవైశ్య వృద్ధ దంపతులు విచ్చేస్తారన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ కోఆర్డినేటర్‌ను తొలగించండి

తిరుపతి సిటీ: ఎస్వీయూ జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్)లో నిబంధనలకు విరుద్ధంగా నియమించిన అసిస్టెంట్ కోఆర్డినేటర్ హరికృష్ణను వెంటనే తొలగించాలని వైఎస్సార్‌సీపీ ఎస్వీయూ విద్యార్థి విభాగం నాయకులు ప్రేమ్‌కుమార్, రాష్ట్ర ఎస్సీ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి నాగరాజు డిమాండు చేశారు. ఈ మేరకు శుక్రవారం రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ ప్రకటన లేకుండా, విద్యార్హతలు, పనిస్వభావం నిర్ణయించకుండా, ప్రభుత్వ అనుమతి లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్‌ను నియమించడం దారుణమన్నారు. వర్సిటీలో అలాంటి ఉద్యోగమే లేదని, కొందరు కావాలని క్రియేట్ చేసి నియమించారని ఆవేదన వ్యక్తం చేశారు.

టంగుటూరి ఆలోచన.. ఎస్వీయూ రూపకల్పన

టంగుటూరి ప్రకాశం పంతులు సేవలు చిరస్మరణీయమని, 1954లో ఆయన ఆలోచనతోనే ఎస్వీయూ ఆవిర్భవించిందని ఎస్వీయూ వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు కొనియాడారు. శుక్రవారం టంగుటూరి 152వ జయంతిని వర్సిటీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిపాలనా భవనం ఎదుట ఉన్న టంగుటూరి భారీ విగ్రహానికి వీసీ, రిజిస్ట్రార్లు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తిరుపతి వర్సిటీ ఆయనకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందన్నారు. ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా ఆయన అందించిన సేవలు అజరామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ భూపతినాయుడు, వర్సిటీ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



– తిరుపతి సిటీ

25న కథలు, ఉపన్యాస పోటీలు

తిరుపతి కల్చరల్: గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన వేమన విజ్ఞానకేంద్రంలో విద్యార్థులకు కథలు, ఉపన్యాస పోటీలు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలు 5, 6, 7 తరగతుల విద్యార్థులను జూనియర్లుగా, 8, 9, 10 తరగతుల విద్యార్థులను సీనియర్స్ విభాగంగా రెండు కేటగిరీల్లో ఉంటాయన్నారు. జూనియర్స్ పోటీల్లో సామాజిక అంశంపై నచ్చిన కథ రాయాలని, అందులో కనీసం 2 సామెతలు ఉండేటట్లు చూడాలన్నారు. సీనియర్స్ పోటీల్లో నచ్చిన కథ రాయడంతో పాటు అందులో 5 సామెతలు ఉండాలన్నారు. అలాగే ఉపన్యాస పోటీల్లో సీనియర్లు, జూనియర్లకు 'తెలుగెక్కడుందిరా తెలుగోడా' అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఉంటాయన్నారు. పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు.

గ్రామ స్వరాజ్యాన్ని తెచ్చిన ఘనత జగనన్నదే



మాట్లాడుతున్న కొరుముట్ల శ్రీనివాసులు

తిరుపతి మంగళం : మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని ఆంధ్ర రాష్ట్రంలో గత ఐదేళ్ల పాలనలో నిజం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేనని రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరుముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన తిరుపతిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ గ్రామాలను ఎంతో అభివృద్ధి చేస్తానని చెప్పాడని, కానీ శుక్రవారం రైల్వేకోడూరు నియోజకవర్గంలోని మైసూరాపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఆయన అసలు గ్రామాల అభివృద్ధి గురించే మాట్లాడకపోవడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్నా చంద్రబాబు చెప్పిన సూపర్‌సిక్స్ హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. రైల్వేకోడూరులోని ఓ చర్చిలో ఆడ, మగ అనే తేడా లేకుండా కూటమి నేతలు దాడులకు తెగబడ్డారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రజలే నిలదీసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు.

బైక్‌ల చోరీ కేసులో ఇద్దరికి జైలు

తిరుపతి లీగల్ : ద్విచక్ర వాహనాల చోరీ కేసులో ఇద్దరికి మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. తిరుపతి రూరల్ మండలంలోని పెరుమాలపల్లి పంచాయతీ లక్ష్మీపురానికి చెందిన షేక్ సంపత అలియాస్ బాషా, ఎం.హరీష్ ఈ ఏడాది ఫిబ్రవరిలో తిరుపతి కేటీ రోడ్డులో ఎస్.నరసింహమూర్తికి చెందిన బైక్‌ను అపహరించారు. అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. అలాగే గతేడాది జూలై 20వ తేదీ తిరుపతి మంగళం భూపాల్ హౌసింగ్ కాలనీలోకి చెందిన కే.సుజాత ద్విచక్ర వాహనాన్ని నిందితుడు ఎం.హరీష్ అపహరించాడు. దీనిపైనా అలిపిరి పోలీసులు కేసు దర్యాప్తు చేసి హరీష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు హరీష్‌కు మూడు నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ఐదుగురికి...

తిరుపతి లీగల్ : అధిక మోతాదులో మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న ఐదుగురికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఒకసారి మద్యం తాగి వాహనం నడిపిన కేసులో పట్టుబడి జరిమానా చెల్లించి తిరిగి అదే నేరానికి పాల్పడినందుకు కడప, ఓబులవారిపల్లికి చెందిన బైక్ నడిపిన షేక్ భక్షుకు ఐదు రోజులు జైలుశిక్షతో పాటు రూ.15000 భారీ జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. అలాగే తిరుపతి పూలతోట వీధికి చెందిన ఆటో డ్రైవర్ సురేష్‌కు, తిరుపతి ఎస్వీ నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కె.ప్రసాద్‌కు, అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన ఆటో డ్రైవర్ డి.బాబా ఫక్రుద్దీన్‌కి, తిరుపతి ఎస్టీవీ నగర్‌కు చెందిన ద్విచక్ర వాహనదారుడు మునిశేఖర్ ఆచారికి రెండు రోజుల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించారు. అలాగే స్వల్ప మోతాదులో మద్యం తాగి నగరంలో వాహనాలు నడుపుతున్న 13 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా, నగరంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 31 మందికి రూ.15,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

ఘనంగా ఖాతాదారుల దినోత్సవం



ఖాతాదారులను సన్మానిస్తున్న బ్యాంకు సిబ్బంది

తిరుపతి(అలిపిరి): ఇండియన్ బ్యాంక్ స్థాపించి 118 ఏళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి అవిలాల ఇండియన్ బ్యాంక్ శాఖలో శుక్రవారం ఖాతాదారుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోనల్ మేనేజర్ ఎం.సెల్వరాజ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రారంభించిన సామాజిక భద్రతా పథకాలను బ్యాంక్ చురుగ్గా అమలు చేస్తోందన్నారు. ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్త వహించాలని ఖాతాదారులను కోరారు. ముగ్గురు సీనియర్ ఖాతాదారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అవిలాల బ్రాంచ్ మేనేజర్ పంకజ్ కక్కర్, తులసి, పల్లవి, రిటైర్డ్ టీటీడీ ఉద్యోగులు, సీనియర్ కస్టమర్లు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

27 నుంచి రిలే నిరాహార దీక్షలు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, గురుకుల, కేజీబీవీ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 27, 28, 29 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి తెలిపారు. శుక్రవారం బైరాగిపట్టెడలోని సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు.

పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలన



మేయర్‌తో సమావేశమైన జైపూర్ కార్పొరేషన్ బృందం

తిరుపతి తుడా : గ్రేటర్ జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇంజనీరింగ్, పారిశుద్ధ్య విభాగాలకు చెందిన ఏడుగురు అధికారుల బృందం, పారిశుద్ధ్య కమిటీ చైర్మన్లు శుక్రవారం తిరుపతి నగరమేయర్ డాక్టర్ శిరీషాను కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో అవలంభిస్తున్న పారిశుద్ధ్య నిర్వహణ, ప్రాసెసింగ్ ప్లాంట్లు, వినూత్న విధానాలు, రెవెన్యూ ట్యాక్స్ వసూళ్ల విధానాన్ని పరిశీలించారు. అనంతరం వీసీ హాల్‌లో అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జైపూర్ బృందానికి వివరించారు. ఈ సందర్భంగా నగర మేయరు జైపూర్‌ను విజిట్ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మేయర్‌తో పాటు అదనపు కమిషనర్ చరణ్‌తేజ్, ప్రజారోగ్య అధికారి యువ అన్వేష్, కార్పొరేటర్ నారాయణ, రెవెన్యూ అధికారి సేతుమాధవ్, సూపరింటెండెంట్ రవి, జైపూర్ బృందం కమిటీ చైర్మన్ కిషోర్ ప్రజాపతి, డిప్యూటీ కమిషనర్ భరద్వాజ్, అసిస్టెంట్ ఇంజినీర్ ఓం ప్రకాష్ కాలా, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ప్రదీప్ కుమార్ మిశ్రా, ఆర్ఐలు మనోహరాచార్య, కార్పొరేటర్ అభయ్ పురోహిత్, రామ్ స్వరూప్ మీనా ఉన్నారు.

విశ్వగురువుగా భారత్‌కు గుర్తింపు



పాకాల : మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా



తిరుపతి సిటీ: జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: అంతరిక్షంలో చంద్రయాన్–3 విజయఢంకా మోగించిన నాటి నుంచి భారత్ విశ్వ గురువుగా గుర్తింపు పొందిందని రిటైర్డ్ ఐఆర్ఎస్ ఆఫీసర్ పురుషోత్తం నాయుడు కొనియాడారు. శుక్రవారం నేషనల్ స్పేస్ డే సందర్భంగా జాతీయ సంస్కృత వర్సిటీలో ప్రత్యేక కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ స్పేస్ రంగంలో మనదేశం ఎంతో పురోభివృద్ధి సాధించిందన్నారు. సైన్స్ పట్ల మరిన్ని వైజ్ఞానిక అంశాలను సమాజానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయం సాధించిన రోజును నేషనల్ స్పేస్ డేగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ విష్ణుభట్టాచార్యులు, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ సాంబశివమూర్తి, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ దక్షిణామూర్తి శర్మ, ప్రొఫెసర్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా భారత జాతీయ స్పేస్ దినోత్సవం

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా భారత జాతీయ స్పేస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా మాట్లాడుతూ చంద్రయాన్–3 విజయం ప్రతి భారతీయుడు గర్వించదగిన క్షణమని తెలిపారు.

అంతరిక్ష పరిశోధనలో ఇస్రో కీర్తి అమోఘం

తిరుపతి మంగళం : జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలకు తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి శుక్రవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్ష పరిశోధనలో దేశ గౌరవాన్ని, ప్రతిష్టను ఇస్రో శాస్త్రవేత్తలు ఇనుమడింపజేస్తున్నారని, ఇదే పరంపర కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. అంతరిక్ష ప్రయోగాలకు తన పార్లమెంట్ పరిధిలోని శ్రీహరికోట కేంద్ర కావడం గర్వంగా ఉందన్నారు. శ్రీహరికోట శాస్త్రవేత్తలకు, సాంకేతిక సిబ్బందికి అన్నివేళలా తన సహాయ సహకారాలు ఉంటాయని ఎంపీ గురుమూర్తి తెలిపారు.

ఉపాధి పనులపై గ్రామసభల్లో వినతులు

చంద్రగిరి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టాల్సిన పనులపై మండల వ్యాప్తంగా శుక్రవారం గ్రామసభలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రగిరిలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరయ్యారు. ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో చేపటాల్సిన పలు పనులపై ప్రజలు, ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తొండవాడలో సర్పంచ్ మల్లం దీపికరెడ్డి ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. చెక్‌డ్యాం నిర్మాణం, పంచాయతీలో లక్ష లీటర్ల నీటి సామర్థ్యంతో వాటర్‌హెడ్ ట్యాంకు, గోపాలపురం ఎస్టీ కాలనీలో శ్మశాన వాటిక ప్రహరీ, గొర్రెల షెడ్డు నిర్మాణం, తొండవాడ ఎస్సీ కాలనీ వాసుల శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం, గ్రామానికి చెందిన క్రీడా మైదానం అభివృద్ధి, తుమ్మలగుంట చెరువులో వాకర్స్‌కు ఏర్పాటు చేసిన తరహాలో ఇక్కడ కూడా ప్రత్యేక ట్రాక్ ఏర్పాటు చేయాలని, లైబ్రరీ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సుధాకర్, సింగిల్ విండో మాజీ చైర్మన్ మల్లం చంద్రమౌళిరెడ్డి, వైస్ ఎంపీపీ నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల: మండలంలోని వడ్డేపల్లిలో జరిగిన గ్రామసభకు ఎమ్మెల్యే నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ అన్ని పనులు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నంగా పద్మాజరెడ్డి, డీపీఓ సుశీలాదేవి, పీడీ శంకర్‌ప్రసాద్, ఎంపీడీఓ ప్రభాకర్, తహసీల్దార్ నిత్యానందబాబు, సర్పంచ్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే నాని పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.





పాకాల: మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి: గ్రామసభలో మాట్లాడుతున్న తొండవాడ సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి